క్లుప్తంగా

రికార్డులు సక్రమంగా ఉండాలి

గురజాల: దుకాణాల్లో రికార్డులు సక్రమంగా ఉండేలా చూడాలని మండల వ్యవసాయాధికారిణి సంధ్యారాణి సూచించారు. నగర పంచాయతీలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణాల్లో పెస్టిసైడ్స్ అధిక ధరలకు విక్రయిస్తున్నారా లేదా అని పరిశీలించడంతో పాటు స్టాక్ ఎంత ఉంది అన్న వివరాలను పరిశీలించామన్నారు.

25న సినిమా పాటల పోటీలు

పిడుగురాళ్ల: ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం మ్యూజిక్ అకాడమీ (ఏపీ, తెలంగాణ) 12వ వార్షికోత్సవం ఈ నెల 25వ తేదీ పట్టణంలోని ఏబీసీ సీబీసీఈ స్కూల్లో నిర్వహించనున్నట్లు అకాడమీ నిర్వాహకుడు అయ్యాంగారు గురువారం తెలిపారు. ఔత్సాహిక గాయనీ గాయకులు ఈ నెల 10 లోపు పాటలు పాడుతూ వీడియో తీసి ఎస్బీపీ అకాడమీ వారికి పంపాలని తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 6304699630, 7288997064 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యువత వివేకానంద చరిత్రను తెలుసుకోవాలి



మాచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా రామకృష్ణ మిషన్ 125వ ఆవిర్భావ వార్షికోత్సవాలలో భాగంగా నియోజకవర్గంలోని విద్యార్థులకు స్వామి వివేకానంద చరిత్రను తెలుసుకొని ఆయన ఆశయాలను యువత కొనసాగించాలని శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి అన్నారు. గురువారం స్థానిక కృష్ణవేణి స్కూల్లో నిర్వహించిన జాగృతి సాంస్కృతిక పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ నవభారత నిర్మాణం జరగాలంటే ప్రతి ఒక్కరూ స్వామి వివేకానంద సాహిత్యాన్ని చదవాలని కోరారు. బహుమతులు అందజేసిన వారిలో కృష్ణవేణి స్కూల్ హెచ్ఎం హనుమంతరావు, సేవా సమితి సభ్యులు షేక్ చిన లాలుసాహెబ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

దుర్గి: వేగనియంత్రణ చర్యలలో భాగంగా ఎస్ఐ టి.వెంకటరమణ గురువారం ప్రధాన రహదారిలో రెండు వైపులా డ్రమ్ములను ఏర్పాటు చేశారు. ఈ సంద్భంగా ఏర్పాటు చేసిన డ్రమ్ములను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మాచర్ల – కారంపూడి ప్రధాన రహదారిలో ఈ మధ్య కాలంలో ఎక్కువగా ద్విచక్రవాహనదారుల నిర్లక్ష్యం, అతి వేగం కారణంగా ప్రమాదాలకు గురికావటమే కాకుండా వారి వలన ఎదురుగా వస్తున్న వారికి సైతం గాయాలు కావటం, కొందరు ప్రాణాలను విడవటం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దుర్గి పోలీసు స్టేషన్ పరిధిలో ఇరు వైపులా ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రమాదకర స్థలాలను గుర్తించి ఆయా ప్రాంతంలో ఈ డ్రమ్ములను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. వాహనదారులు, ప్రజలు సహకరించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. ఏఎస్ఐ ప్రభుదాసు, రైటర్ రాంబాబు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



మాచర్ల: మృతిచెందిన ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేస్తుందని మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి అన్నారు. గురువారం 10వ వార్డులో మృతిచెందిన జంధ్యాల ఆంజనేయులు కుటుంబ సభ్యులకు మట్టిఖర్చుల నిమిత్తం రూ.10వేల నగదును మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణ బాబు, కౌన్సిలర్లు తేరాల సిద్దయ్య, చంద్ర కుమార్, మందా సంతోష్, సచివాలయ అడ్మిన్ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గురజాల: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గురజాలకు చెందిన షేక్ నజీర్ బాష గత నెల 27వ తేదీన గాంధీబొమ్మ సెంటర్లో ద్విచక్రవాహనంపై సిమెంటు బస్తా తీసుకువెళ్తున్న సమయంలో వెనుక నుంచి ఆటో అతి వేగంగా వచ్చి వెనక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో నజీర్‌కు కుడి కాలు, ఎడమ కాలు తొంటిపై గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని వైద్యశాలకు తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కొరకు గుంటూరుకు తరలించారు. బుధవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సీఎం వైఎస్ జగన్ అందరివాడు

- ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీలో చేరిక



పీఆర్కే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న మాచర్ల పదో వార్డుకు చెందిన టీడీపీ నేతలు

మాచర్ల: రాష్ట్రంలో అన్నివర్గాల ఆమోదం పొందిన నాయకుడుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఖ్యాతి గడించారని, అందకు ఆయన అందరివాడుగా నిలిచి, అన్నివర్గాల ఆదరాభిమానాలను చూరగొంటున్నారని పల్నాడు వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 10వ వార్డుకు చెందిన పలువురు టీడీపీ నాయకులు ఆ పార్టీని వీడి పీఆర్కే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీ నాయకులు హనుమూరు ప్రసాద్, నాని, గొర్రెల మల్లిఖార్జునరావు, సేనాపతి చెన్నకేశవులు, లావు శిరీషా, కాజా రాజేశ్వరి, రావూరి పద్మలతోపాటు వివిధ సామాజిక వర్గాలకు చెందిన మరో 15 కుటుంబాలు సీఎం జగన్‌కు జేజేలు పలుకుతూ పీఆర్కే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మరొక్కసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్ర ప్రజలందరూ ఉత్సాహపడుతున్నారన్నారు. అది సహించలేక ప్రతిపక్షనేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జనసేన నేత పవన్‌కల్యాణ్‌లు రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ ఎల్లో మీడియాలో అలజడి సృష్టిస్తున్నారని, అయినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్, రాష్ట్ర కృష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పి.అంజిబాబు, వార్డు కౌన్సిలర్లు తేరాల సిద్దయ్య, చంద్రకుమార్, కలివెల సురేష్ ఆధ్వర్యంలో వీరంతా వైఎస్సార్ సీపీలో చేరారు. కొమెర బుజ్జి, లక్ష్మీనారాయణలతోపాటు ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు



పురుగు మందుల షాపును తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, తహసీల్దార్

మాచర్ల: పట్టణంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మాచర్ల వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ), వ్యవసాయ మండల అధికారి కె.లక్ష్మారెడ్డి, తహసీల్దార్ రమేష్‌కుమార్‌లు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. పత్తి ఫ్యాక్టరీ ఆవరణలో ఉన్న ఎరువుల, పురుగు మందుల దుకాణాలను సందర్శించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా లేవా అని తెలుసుకున్నారు. నకిలీ మందులు ఉన్నాయేమో అని పరిశీలన చేశారు. మిరప పంట పచ్చ తామర పురుగు నివారణ నిమిత్తం ఉపయోగించే పురుగు మందును ఎమ్మార్పీకే రైతులకు అందుబాటులో ఆర్బీకే కేంద్రాల్లో లభిస్తాయని తెలిపారు. అదేవిధంగా షాపుల్లో కూడా విక్రయించాలని ఆయా షాపుల యజమానులకు సూచించారు. ఎక్కడైనా నకిలీ పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో మండల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఎమ్మెల్యే కాసు అభినందన



భార్గవ్‌రెడ్డిని దుశ్శాలువాతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే కాసు

గురజాల: గత నెల 27 నుంచి 29వ తేదీ వరకు గుజరాత్‌లో జరిగిన 12వ జాతీయ జూనియర్ సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించిన పాశం భార్గవ్ రెడ్డిని ఎమ్మెల్యే గురువారం అభినందించారు. లాంగ్ జంప్, 400 మీటర్స్ రన్నింగ్‌లలో రెండు పోటీల్లో బంగారు పతకాలు సాధించడం పల్నాడు ప్రాంతానికే గర్వకారణమన్నారు. మండల పరిధిలోని అంబాపురం గ్రామానికి చెందిన భార్గవ్‌రెడ్డి పల్నాడు ప్రతిభను దేశం నలుమూలలా వ్యాప్తి చేశాడన్నారు. చిన్న గ్రామంలో పుట్టి పెరిగి మంచి ప్రతిభ కనబరచి రెండు పతకాలు సాధించడం హర్షించదగిన విషయమన్నారు. ఆనంతరం భార్గవ్‌రెడ్డిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. పాశం హనిమరెడ్డి, పాశం పాపిరెడ్డి, బి.నాగేశ్వరరావు నాయక్, చల్లా కాశీబాబు, దేవండ్ల నీలంరాజు, కర్రా గిరిబాబు, గోళ్ల సైదయ్య తదితరులున్నారు.

అర్హత ఉంటే ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి హారతులు ఇస్తున్న మహిళలు

గురజాల: అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు వారి గడప వద్దకు వస్తాయని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక నగర పంచాయతీలోని సచివాలయం 1 పరిధిలోని 2వ బ్లాకులో గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి వారికి సంక్షేమ పథకాలు అందిన విషయాలను గత ప్రభుత్వ పాలనకు ప్రస్తుత పాలనకు వ్యత్యాసం చూపుతూ ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తూ చిన్నా పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరికి ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంతో పోల్చితే ఈ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, రైతు భరోసా వంటి ఎన్నో సంక్షేమ పథకాలతో ప్రజలకు పాలన చేరువ చేయడం జరిగిందన్నారు. వలంటీర్ వ్యవస్థ, గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు, రైతు భరోసా కేంద్రాల వంటి పథకాల వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్మన్‌లు షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, 2వ వార్డు కౌన్సిలర్ షేక్ మస్తాన్‌బీ, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, గుంటూరు రైల్వే బోర్డు మెంబర్ కె.రవిశంకర్, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్, ముస్లీం మైనార్టీ నాయకుడు షేక్ నాగులుమీరా, షేక్ నాసర్ సైదా, షేక్ సుభాని, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ కె.ప్రగతి కోటేశ్వరరావు, తదితరులున్నారు.

అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా లక్ష్మీరాజ్యం



విజయపురిసౌత్: స్థానిక అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఎం.లక్ష్మీరాజ్యం గురువారం బాధ్యతలను చేపట్టారు. ఇప్పటివరకు పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న దేవరకొండ బాల కృష్ణ జనవరి 31వ తేదీన ఉద్యోగ విరమణ కావటంతో ఇదే పాఠశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న మచ్చ లక్ష్మీరాజ్యం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేస్తానన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ లక్ష్మీరాజ్యంను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ప్రశాంత వాతావరణంలో పోటీలు నిర్వహించాలి



రెంటచింతల: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని సత్రశాలలో వేంచేసిన గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానం సమీపంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగు ప్రదర్శన పోటీలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. గురువారం ప్రభుత్వ విప్ పీఆర్కే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, కమిటీ సభ్యులు, పార్టీ నేతలతో కలిసి ఎడ్ల ప్రదర్శన పోటీల పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. పవిత్ర శైవక్షేత్రమైన మల్లిఖార్జునస్వామి సన్నిధిలో అఖిలభారత రెడ్ల కుల గురువు శివభక్త కుంటి మల్లారెడ్డి అన్నదాన సత్రం మైదానంలో ఈ నెల 12 నుంచి 17 వరకు ఏర్పాటు చేసిన ఈ పోటీలు ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జీడీసీఎంఎస్ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పులి ఓబుల్‌రెడ్డి, నెవలి సీతారామిరెడ్డి, యర్రెద్దు శ్రీనివాసరెడ్డి, చింతా శివారెడ్డి, దొండేటి వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నేతలు పాతపాటి పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు మాదల విద్యార్థులు

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.కె.ఎమ్.డి.రియాజ్ గురువారం తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో జరిగిన అండర్–14 విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొని ద్వితీయస్థానం సాధించిందన్నారు. మాదల జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఎనిమిదో తరగతికి చెందిన ఎస్.శ్రావ్య జాతీయజట్టులో స్థానం సంపాదించిదన్నారు. అలాగే వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంటలో జరిగిన అండర్–17 విభాగం బాలుర, బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన గొర్రెపాటి ప్రదీప్, గుడిగుంట్ల దివ్యలు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

ప్రతివర్గం హితమే ప్రభుత్వ ధ్యేయం

గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ పీఆర్కే



వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలందరూ మద్దతు తెలిపి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అభివృద్ధి మండల చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం అడిగొప్పల గ్రామంలో రెండో రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ప్రతి వర్గం అభ్యున్నతే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందరి వాడిని వివరించారు. గ్రామ సచివాలయంలో పూర్తిస్థాయిలో ఉద్యోగులను నియమించి పౌరసేవలను అందిస్తున్న ఘనత మన ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. పాఠశాలలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అద్భుతంగా పనిచేసే విధంగా తీర్చిదిద్దిన ఘనత మన ప్రభుత్వానిదేన్నారు. రైతులు, విద్యార్థులు, వృద్ధులు, వితంతువులకు పలు వర్గాల ప్రజలకు మంచి చేసే ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని కొనియాడారు. ప్రజలందరి దీవెనలతో రాబోవు రోజులలో మరలా మన ప్రభుత్వ ఏర్పాటుకు అందరి సహకారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచి నాలి రామయ్య, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోఆల్, ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నం పెద్దబ్బాయ్, నల్లబోతు వెంకటేశ్వర్లు, జెడ్పిటీసీ మాజీ సభ్యుడు కొనకంచి బాబు, కటకం చిన వెంకటయ్య, తోట వాసు, గర్నె లక్ష్మీనారాయణ, జంగా యలమంద, నాగెండ్ల లక్ష్మీనారాయణ, మైలవరపు మహేష్, సంకురాత్రి సీతయ్య, గురువులు, మాచర్ల జార్జి, పెరుగు శివకృష్ణ, రాయపాటి నాగేశ్వరరావు, కోట బ్రహ్మం, తెల్లపరపు కోటేశ్వరరావు, షేక్ జానీ, నాగుల్‌మీరా, జక్కా రమేష్, చిలకల అంజిరెడ్డి, దారిడి లక్ష్మారెడ్డి, ఉప్పు రామకృష్ణ పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ ఎన్నికకు పకడ్బందీ ఏర్పాట్లు

ఆర్డీఓ అద్దయ్య



తహసీల్దార్, కమిషనర్‌తో సమీక్షిస్తున్న ఆర్డీఓ అద్దయ్య

దాచేపల్లి: నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి చేశామని గురజాల ఆర్డీఓ, ఎన్నికల నిర్వహణ అధికారి కె.అద్దయ్య అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ మీసాల డానియేలు, సీఐ షేక్ బిలాలుద్దీన్, కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, సిబ్బందితో గురువారం ఆయన సమీక్ష జరిపారు. శుక్రవారం చైర్‌పర్సన్ ఎన్నికపై చర్చించి పలు సూచనలు చేశారు. ఉదయం 11గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలోనే చైర్‌పర్సన్ ఎన్నిక జరుగుతుందని, కౌన్సిలర్లు, ఎక్స్ ఆఫీషియో సభ్యులకు మాత్రమే సమావేశం మందిరంలోకి అనుమతి ఉంటుందని ఆర్డీఓ అద్దయ్య చెప్పారు. చైర్‌పర్సన్ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని, కార్యాలయం ప్రాంతాల్లో ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందని ఆయన తెలిపారు. గుర్తింపుకార్డులు ఉన్న వారికే అనుమతిస్తామని ఆయన వెల్లడించారు.

మంత్రి పర్యటనను జయప్రదం చేయండి

మాచర్ల: పట్టణాభివృద్ధిలో భాగంగా ఫిబ్రవరి 4వ తేదీన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర పురపాలక సంఘ మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రారంభిస్తారని మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి గురువారం తెలిపారు. పట్టణంలో నీటి ఎద్దడి లేకుండా సమగ్ర నీటి సరఫరా పథకం కింద రూ.81 కోట్లతో బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి మంచినీటి సరఫరాకు పైపులైన్‌ల పథకం, 14.5 ఎంఎల్‌డి రక్షిత మంచినీటి ప్లాంట్ పైలాన్‌ను పురపాలక సంఘంలో ఆవిష్కరిస్తారన్నారు. అదే విధంగా రూ.403 కోట్లతో మాచర్ల నుంచి దాచేపల్లి వరకు నూతనంగా నిర్మించే హైవే నిర్మాణానికి శంకుస్థాపన, పురపాలక సంఘ మంచినీటి క్వారీ చుట్టూ నూతనంగా నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పర్యటనను జయప్రదం చేసి కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ అభిమానులు, ప్రజలు అందరూ హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఘనంగా వీరభద్ర స్వామి కల్యాణం



వీరభద్ర స్వామి మూలవిరాట్

దుర్గి: మండలంలోని పోలేపల్లి గ్రామంలో వేంచేసి యున్న భద్రకాళి సమేత వీరభద్ర స్వామి తిరునాళ్ల గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధులలో ఊరేగింపు నిర్వహించారు. తెలంగాణ మహిళల ఆధ్వర్యంలో కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. ఎస్ఐ టి.వెంకటరమణ స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సర్పంచి పాలవాయి అంజిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు గుర్రం కేశవరెడ్డి, పాలువాయి కృష్ణారెడ్డి, దేశం లింగారెడ్డి, దేశం వెంకటరెడ్డి, కోట్ల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లా ఎడ్లకు ప్రథమస్థానం



ఆరు పళ్ల విభాగంలో బండ లాగుతున్న ఎడ్లు

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహాస్వామి 67వ కల్యాణ మహోత్సవం సందర్భంగా రెండవ రోజు గురువారం నిర్వహించిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజములు బల ప్రదర్శనా పోటీల్లో భాగంగా నాలుగు పళ్ల విభాగంలో వల్లభనేని మోహన్‌రావు (ఎన్టీఆర్ జిల్లా) ఎడ్లు 4355 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. రెండవ స్థానంలో ఎదునుపల్లి శ్రీనివాసరావు (సరిపూడి, మేడికొండూరు మండలం), సంపటం వీరబ్రహ్మానాయుడు (ఉయ్యందన, క్రోసూరు మండలం) కంబైన్డ్ ఎడ్ల జత 4230 అడుగులు, పిక్కిలి తేజశ్రీ మురళి (మాచవరం మండలం, పిన్నెల్లి గ్రామం) ఎడ్లు 4200 అడుగులు, మందపాటి నిఖితా చౌదరి (గోపాలవారిపాలెం, చిలకలూరిపేట మండలం), మామిళ్ల జాలాశ్రీ (ఇక్కుర్తి, నర్సరావుపేట మండలం) కంబైన్డ్ ఎడ్ల జత 4126 అడుగులు, ఉమ్మారెడ్డి శ్రీవల్లి (గంగన్నపాలెం, ముండ్లమూరు, ప్రకాశం జిల్లా ఎడ్లు 4050 అడుగులు, రామినేని రత్తయ్య చౌదరి (తోటపాలెం, చేబ్రోలు మండలం) 3879 అడుగులు, ఒంగోలు సతీష్ నాయుడు (గాజులపాలెం, బొల్లాపల్లి మండలం) ఎడ్లు 3600 అడుగులు, సూరబోయిన రాజకుమారి రేవంత లక్ష్మి (శ్రీరుక్మిణీపురం, మాచవరం మండలం) 3497 అడుగుల దూరాన్ని లాగి వరుస బహుమతులు అందుకున్నాయి. నిర్వాహకులు వీరికి వరుసగా రూ. 25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ. 6వేలు బహుమతులు అందజేశారు.

ఆరు పళ్ల విభాగంలో ప్రకాశం జిల్లా ఎడ్లకు ప్రథమం..

ఆరు పళ్ల విభాగంలో వజ్రాల తేజస్విరెడ్డి (సంతమావులూరు, ప్రకాశం జిల్లా) ఎడ్లు 4181 అడుగులు దూరాన్ని ప్రథమ స్థానంలో నిలిచాయి. బత్తుల చిన్నబ్బాయి పద్మావతి యాదవ్ (వినుకొండ) ఎడ్లు 3888 అడుగులు, వంద్రు మల్లయ్య జీవ ప్రసాద్ (మత్కుపల్లి, శావల్యాపురం మండలం) ఎడ్లు 3866.3 అడుగులు, కంచుపాటి శ్రీనివాస చౌదరి (మాడుగుల, గురజాల మండలం) ఎడ్లు 3704 అడుగులు, అన్నంగి వెంకటేష్ యాదవ్ (శ్రీరుక్మిణీపురం, మాచవరం మండలం) 3413.3 అడుగులు, కొప్పుల హేమలత శ్రీనివాసరెడ్డి (రామలక్ష్మీపురం , కోదాడ, తెలంగాణా) ఎడ్లు 3400.9 అడుగులు, మోటమర్రి రమేష్ (పిన్నెల్లి, మాచవరం మండలం) 3400 అడుగుల దూరాన్ని వరుస స్థానాల్లో నిలిచాయి. నిర్వాహకులు వీరికి వరుసగా రూ. 30 వేలు, రూ.25 వేలు, రూ. 20 వేలు, రూ.15 వేలు, రూ.10వేలు, రూ.8 వేలు, రూ.6వేలు బహుమతులు అందజేసారు. వ్యాఖ్యాతలుగా సూరపనేని రాధాకృష్ణ, దుర్గి శ్రీనివాసరావు వ్యవహరించారు.

రోడ్డు ప్రమాద ఘటనలో మహిళ మృతి



లింగా నాగేంద్రమ్మ (ఫైల్)

దుర్గి: గత నెల 27వ తేదిన వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులో జరిగిన ఒక వివాహానికి వాహనంలో వెళ్తుండగా వెల్దుర్తి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు మృతి చెందగా, ఎనిమిది మంది గాయాలపాలైన విషయం పాఠక విధితమే. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు గత నెల 29వ తేదీన వైద్యులు తెలిపారు. వారిలో లింగా నాగేంద్రమ్మ (46) గురువారం మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ఈమెకు భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి...

గురజాల: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెలిసిన వివరాల ప్రకారం....పులిపాడు రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన వెంచర్ గోడ వద్ద ఒక మృతదేహాన్ని కూలీలు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ బి.అనంతకృష్ణ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతిచెంది ఇప్పటికి మూడు, నాలుగు రోజులు అయిఉంటుందని, ఏ విధంగా మృతిచెందాడు అన్న విషయాన్ని పరిశీలించాలన్నారు. అనుమానస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటన స్థలాన్ని సీఐ కె.ప్రభాకర్ పరిశీలించారు. మృతదేహాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంకు తరలించారు.

యేచూరి సేవలు ప్రశంసనీయం



రెంటచింతల: స్థానిక కానుకమాత దేవాలయం 173వ తిరునాళ్లకు విచ్చేసిన వేలాదిమంది భక్తులకు ఆర్యవైశ్య మండల సంఘం మాజీ అధ్యక్షుడు యేచూరి వెంకట సైదయ్య చేస్తున్న సేవలు ప్రసంశనీయమని ఎస్ఐ సయ్యద్ సమీర్‌బాష అన్నారు. గురువారం వెంకట సైదయ్య ఏర్పాటు చేసిన మజ్జిగ, మంచినీరు పంపిణీ కేంద్రాన్ని ఆయన దుర్గిమార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గత 17 సంవత్సరాలుగా భక్తులకు ఇటువంటి సేవాకార్యక్రమాలు చేపడుతున్న స్థానిక వైఆర్ఎస్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ యేచూరి వెంకటసైదయ్యను ఇతరులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నాళం పెదబాబు, గుండా జనార్దన్, ఎన్.శ్రీనివాసరావు, గాదె కిరీట్‌రెడ్డి, గుండా రామ్మూర్తి, నాళం చినబాబు తదితరులున్నారు.